

ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 5 సంచిక : 12 పుష్పం : 47-50 5-9-2000

**RAMANA BHASKARA**
**TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE**
PAGES : 24+4

**VOL: 5 ISSUE: 12**

CHIEF EDITOR
**P. S. RAMA RAJU**

EDITOR
**P.H.V. SATYAVATHI (HYMA)**

**SUBSCRIPTION**
YEARLY : RS. 125
Each copy Rs. 10

ADDRESS
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
JINNURU - 534 265
W.G.Dt., A.P.

**PUBLISHER**
P.S.RAMARAJU
LAKSHMI MODERN RICE MILL
ULLAMPARRU - PALAKOL
☎ 08814 - 24589, 24689

**PRINTER**
SHRIRAM GRAPHICS
BANK STREET - PALAKOL
☎ 08814 - 24278

## రమణ మహర్షి సూక్తులు సర్వదా ఆచరణీయం


శ్రీ రమణ మహర్షి మానవ కళ్యాణం కోసం చెప్పిన విషయాలు భారతదేశంలోనే కాకుండా దేశ, విదేశాల్లో ఆలోచింపజేస్తున్నాయి. రమణ మహర్షి చెప్పిన విషయాలే సద్గురు శ్రీ నాన్నగారు సామాన్య ప్రజలకు అర్థమయ్యే రీతిలో సంవత్సరాలుగా చేస్తున్న ప్రచారం రాష్ట్రమంతటా మంచి గుర్తింపు వచ్చింది. విరామం ఎరుగని రీతిలో ఆయనకు వస్తున్న ఆహ్వానాలే యిందుకు ప్రత్యక్ష సాక్ష్యం. లండన్‌లోని రమణ భక్తులు కూడా రెండుసార్లు సద్గురు శ్రీ నాన్నగారిని ఆహ్వానించి రమణ బోధలు శ్రవణం ద్వారా తృప్తిని చెందారు. ఆరాటం పోరాటం ద్వారా అశాంతి జీవనంలో చిక్కుకున్నవారికి జ్ఞాన మార్గమే నాన్నగారు చెప్పే ప్రసంగపాఠాలు. వాటిని ఎప్పటికప్పుడు అందిస్తున్నాం. మీ సూచనలు సలహాలు యివ్వండి.


.... చీఫ్ ఎడిటర్

### ఈ సంచికలో....

**సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు**

11-7-2000, పాలకోడేరు ........ 3
30-7-2000, హైదరాబాద్........ 10
10-8-2000, పోడూరు ........ 15
28-8-2000, భీమవరం........ 20


భగవాన్


అరుణాచలం


సద్గురు

అరుణాచలం! అరుణాచలం! అరుణాచలం. ఇది నిశ్చలమైన జ్యోతి స్వరూపానికి స్థూలరూపము. ఇది భూమికి హృదయమై ఉన్నది. ఇది స్థూలబుద్ధి ఉన్నవారికి కొండగా, రాళ్ళగుట్టగా కనబడినను సూక్ష్మబుద్ధి కలవారికి జ్యోతి స్వరూపముగా వ్యక్తమగును. ఇది మృత్యుంజయుడైన శివుని దేహము. ఇది సిద్ధాంతము కాదు. ఇది యదార్థము. జ్ఞాన సంబంధార్‌నకు, మాణిక్యవాచకర్‌నకు, భగవాన్ శ్రీ రమణ మహర్షికి ఈ కొండ జ్యోతి స్వరూపముగా వ్యక్తమయినది. ఈ కొండ వెలసిఉన్న ఊరు పేరు తిరువణ్ణామలై. ఇది మద్రాసుకు 180 కి.మీ.లు దక్షిణముగా ఉన్నది. ఈ పట్టణము శ్రీ చక్రమువలె నవద్వారములతో వెలసి ఉన్నది. ఇచ్చట శివుడు గిరిరూపములోను, లింగరూపములోను, సిద్ధరూపములోను ఉన్నాడు. కొండపైన ఉత్తర దిక్కున ఒక మర్రిచెట్టు క్రింద పరమేశ్వరుడు దేహధారియై సిద్ధరూపములో ఉన్నాడు. ఇచ్చట వెలసిన లింగం అగ్నిలింగం. అగ్ని జ్ఞానమునకు గుర్తు. జ్ఞానము ద్వారా సిద్ధి పొందుటకు ప్రయత్నించువారు ఈ క్షేత్రమునకు ఆకర్షింపబడుదురు. ఈ క్షేత్రమునకు వచ్చువారు గిరిని దర్శించి, గిరిప్రదక్షిణ చేయుదురు. ఈ క్షేత్రమునకు వచ్చినవారు ఒట్టిచేతులతో తిరిగి వెళ్ళరని నాస్తికులు ఆస్తికులుగను, ఆస్తికులు భక్తులుగను, భక్తులు జ్ఞానులు గను అగుదురని భగవాన్ చెప్పినారు. ఈ కొండలోపల ప్రత్యేకముగా ఒక నాగరికత ఉన్నదని, సిద్ధులు తపస్సు చేసుకొంటున్నారని, నదులు, తటాకములు, ఉద్యానవనములు, రహదారులు కలవని శ్రీరమణమహర్షి చూసి చెప్పినారు. ఈ కొండగాలి తగిలిన వారికి కొండమీద ఉన్న మూలికల ప్రభావము వలన కొన్ని భౌతిక వ్యాధులు ఉపశమించును. గిరి అనుగ్రహము వలన మానసిక ఆరోగ్యము పరిరక్షింపబడును. స్కాంద పురాణములో అరుణాచలగిరి విశిష్టత తెలుపబడి ఉన్నది. స్కందుడు, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, సనత్‌కుమారుడు, జ్ఞానసంబంధార్, శ్రీరమణమహర్షి వీరికి బేధంలేదు. శివుని ఆజ్ఞచే మానవ శరీరము ధరించి మధురై వద్దగల తిరుచ్చుళి అను గ్రామములో భగవాన్ శ్రీరమణమహర్షి 1879వ సం. డిసెంబరు 29వ తేది రాత్రి పునర్వసు నక్షత్ర లగ్నంలో సుందరమయ్యర్, అళగమ్మలకు జన్మించినారు. శ్రీరమణ మహర్షి 11వ ఏట సుందరమయ్యర్ దేహము విడిచినారు. అప్పుడు భగవాన్ మరణం గురించి అంతర్ముఖ దృష్టితో విచారణ మొదలు పెట్టినారు. 1896 జూలై 16వ తేదిన భగవాన్ మీనాక్షి గుడివద్ద చొక్కప్ప నాయకన్ వీధిలో ఉన్న తన పినతండ్రి సుబ్బయ్యర్ ఇంటిలో పై భాగమున ఉన్న గదిలో చదువుకొంటూ ఉండగా

తరువాయి 23వ పేజీలో....

## యజ్ఞ, దాన, తపస్సులను ఆచరించండి. కామ, క్రోధ, లోభములను విడిచిపెట్టండి.

పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరులో జూలై 11న కొత్తపల్లి సోదరులు ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక వేదికపై సద్గురు శ్రీ నాన్నగారు ప్రసంగించారు.

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

శరీరం జీవించి ఉండగానే ఈ భూమిమీద తిరుగుతుండగానే ఎవరైతే శరీరంతో విడిపోయారో, ఎవరైతే మోక్షానుభవం పొందారో వారిని జీవన్ముక్తులు అంటారు. ఏ కారణం వలన కూడా వారికి దుఃఖం రాదు. దుఃఖం ఎలా ఉంటుందో వారికి తెలియదు. ఈ శరీరం ఉండగానే శబ్దస్పర్శలను, ఇంద్రియాలకు సంబంధించిన విషయాలను వారు నిప్పులో పడేస్తారు అందుచేత జీవన్ముక్తుడికి దుఃఖకారణాలు ఉండవు. వారికి రాగద్వేషములు ఉండవు. వారికి దేహం ఉందనే స్పృహే ఉండదు ఇంకలోక విషయాల స్పృహ ఎలా ఉంటుంది. కొంతమంది పక్వం పొందిన జీవులకు చిన్నచిన్న దోషాలు ఉంటే, ఈ శరీరం ఉండగా మోక్షానుభవం కలుగకపోయినా శరీరం మరణించిన తరువాత ఇతరలోకాలలో మోక్షం కలుగుతుంది. వారు మరల ఈ లోకంలోనికి రానక్కరలేదు. వారిది క్రమముక్తి అంటారు. మీరు ఏ స్థాయిలో ఉన్నప్పటికి యజ్ఞ, దాన, తపస్సులను ఆచరించండి, కామ, క్రోధ, లోభములను విడిచిపెట్టండి అని భగవంతుడు చెపుతున్నాడు.

మనం స్వార్థం లేకుండా పనిచేస్తే ఆపని వలన చిత్తశుద్ధి కలుగుతుంది, చిత్తశుద్ధి వలన జ్ఞానం కలుగుతుంది, జ్ఞానం వలన మోక్షం కలుగుతుంది. స్వార్థంతో ఏపనిచేసినా అది పునర్జన్మ హేతువు అవుతుంది. స్వార్థం ఎక్కువైతే సూర్యుడు ఉదయించనటువంటి చీకటిలోకాలలో ఉండవలసి ఉంటుంది. మీరు నిష్కామకర్మ చేసినా, భక్తి మార్గంలో ప్రయాణం చేసినా, ధ్యానమార్గంలో ప్రయాణం చేసినా ఏమార్గానికి ఆమార్గమే స్వతంత్రమైనది, మీరు తరించటానికి ఒక్కమార్గం చాలు అని భగవంతుడు చెపుతున్నాడు. మనస్సుకు పట్టుకుదరాలిగాని ఒక్క మార్గం చాలు, ఆమార్గాన్ని పట్టుకొని వేలాడితే అదే మిమ్మల్ని తరింపజేస్తుంది, మీరు జీవన్ముక్తులవుతారు. జీవన్ముక్తుడికి ఎటువంటి సుఖం ఉంటుందో అటువంటి సుఖాన్ని మీరు కూడా పొందుతారు అని భగవంతుడు హామీ ఇస్తున్నాడు. భగవంతుడు చెప్పినమాటలు ఎన్నిసార్లు చదివినా మనం నమ్మం ఎందుచేతనంటే మనబుద్ధి నిర్మలమైనదికాదు. మనబుద్ధి నిర్మలంగా ఉంటే, శాంతిగా

ఉంటే మనకు శాస్త్రం అర్థమవుతుంది, నిర్మలమైనబుద్ధి లేనివాడికి శాస్త్రం చదివినా అది సరిగా అర్థంకాదు. రాగద్వేషములను దూరంగా విడిచిపెట్టు అని భగవంతుడు చెప్పాడు. రాగద్వేషములు పెట్టుకొని నీవు ఎన్ని పూజలు, జపాలు చేసినా జీవన్ముక్తస్థితి రాదు. రాగద్వేషములను త్యాగం చేయటంకూడా యజ్ఞమే. గాంధీగారు స్వరాజ్యంకోసం ఎముకలు అరిగేలా పనిచేసారు. మనం చేసేపని మంచిది అనుకొన్నప్పుడు చావుకు సిద్ధంగా ఉండేవారు. గాంధీజీ కర్మయోగి, కర్మను యోగంగా చేసారు. కర్మను ఎవడైతే యోగంగా చేస్తాడో వాడిని కర్మ బంధించదు. వాడికి పునర్జన్మ ఉండదు. మనం ఏపని చేసినా సాత్వికబుద్ధితో చేయాలి. మనం ఎవరికైనా పండు ఇస్తే ఇచ్చేటప్పుడు మనబుద్ధి నిర్మలంగా ఉండాలి. దానం అంటూ ఏమీలేదు ఉన్నది పూజే అని వివేకానందుడు చెప్పాడు. దానం అని నీవు అనుకోనక్కరలేదు అంతా పూజే అని చెప్పాడు.

జీవలక్షణాలు పెరగటానికి జీవుడే కారణం, పరమాత్మ కారణంకాదు. ఆ జీవుడు నిజంగాలేడు, ఉన్నాడని నీవు అనుకొంటున్నావు. అది పారమార్థికసత్యంకాదు, వ్యవహారిక సత్యమే. జీవుడు గాఢనిద్రలో లేడు జాగ్రదవస్థలోనే ఉన్నాడు. దేహం మరణించిన తరువాత ప్రయాణం చేసేవాడు జీవుడే. పుణ్యఫలమైన సుఖాన్ని, పాపఫలమైన దుఃఖాన్ని అనుభవించేది జీవుడే. జీవుడును తీసి ఒకప్రక్కన పెడితే ఇంక రాకలేదు, పోకలేదు, పునర్జన్మలేదు. ఏ ప్రథమతలంపు అయితే దేహంతో తాదాప్యం పొందుతోందో ఆ తలంపు యొక్క మూలం నీలోపలే ఉంది. ఆ మూలాన్ని చూడటానికి ప్రయత్నం చేయటంకూడా తపస్సు. నేను అనే మొదటి తలంపుకు వచ్చే ఇతర తలంపులను తగ్గించుకొని అది ఎక్కడ నుంచి అయితే ఉదయిస్తోందో అక్కడకు దానిని చేర్చటం తపస్సు అని భగవాన్ చెప్పారు. ఆత్మజ్ఞానం పొందటానికి కృతయుగంలో పెద్దపెద్ద తపస్సులు చేసారు అని చెపుతారు. కాని కలియుగంలో నారాయణ స్మరణచాలు అన్నారు. ఆస్మరణ నిరంతరం చేస్తూ ఉంటే, ప్రేమగా చేస్తూ ఉంటే సింహాన్ని చూసి జంతువులు ఎలా పారిపోతాయో అలాగ నిరంతరం భగవంతుని స్మరణ చేయటం వలన ఇంద్రియాలకు సంబంధించిన విషయాలు అలాగే పారిపోతాయి. ఈ కలియుగంలో నామస్మరణచాలు, నామస్మరణచేసి మోక్షాన్ని పొందవచ్చు అని చెప్పారు. పూర్వజన్మ వాసనలు ఇప్పుడు మనలను పట్టి పీడిస్తున్నాయి. ఏ వాసనలు అయితే ఈ దేహాన్ని పట్టి బంధిస్తున్నాయో వాటినుండి విడుదల పొందటానికి నీవు చేసే ప్రయత్నమే సాధన. నీ మనస్సు యొక్క ప్రవాహానికి ఎదురీదటమే తపస్సు. ఎవడైతే మనోప్రవాహానికి ఎదురీదటం నేర్చుకొన్నాడో వాడు మనో మూలంలోనికి

వెళతాడు. అప్పుడు వాడు మాట్లాడితే ఎంతో జ్ఞానం ఉంటుంది, వాడి చూపులో జ్ఞానం ఉంటుంది, వాడు ఏ పనిచేసినా నిర్మలంగా ఉంటుంది. వాడే జీవన్ముక్తుడు వాడు దేనికి ఆశ్చర్యపడడు. ఇప్పుడు పెద్దవర్షం కురిస్తే ఇంతవర్షం కురుస్తోంది ఏమిటి అని మనం ఆశ్చర్యపడతాము. జీవన్ముక్తుడు దేనికి అబ్బురపడడు. సూర్యుడు చల్లబడినా, చంద్రుడికి వేడి కలిగినా, అగ్నిహోత్రం యొక్క జ్వాల పైకి వెళ్ళకుండా క్రిందకు వచ్చినా వాటిని చూసినా జీవన్ముక్తుడు ఏమీ ఆశ్చర్యపడడు. జీవన్ముక్తుడి యొక్క స్థితి అట్టిది. సాధుసాంగత్యం కూడా తపస్సుతో సమానము. నీ ముక్కులో గాలి తిరుగుతున్నంతకాలం పాడుచేసుకొంటారు. అవి అన్నీ కూడా వ్యవహారిక సత్యమే, పారమార్థిక సత్యంకాదు. ఒక గొల్లవాడు గొర్రెపిల్లను చంకలో పెట్టుకొని నాగొర్రెపిల్ల ఏది అని ఊరంతా వెతుకుచున్నాడు. మనందరిదీ ఆగొల్లపిల్లవాడి తంతులా ఉంది. నీ హృదయంలో సత్యాన్ని పెట్టుకొని సత్యం ఎక్కడ ఉంది అని ఆలోకాలు, ఈలోకాలు తిరిగి కాలం వృధా చేసుకొంటున్నాము. గొర్రెపిల్ల ఎక్కడ ఉంది వాడి చంకలోనే ఉందికానివాడికి ఆస్మృతి లేదు. మనం కూడా అంతే. హృదయంలో బంగారాన్ని పెట్టుకొని అది ఎక్కడ ఉంది అని వెతుకుచున్నాము. దేవుడు ఎక్కడ ఉన్నాడు అని వెతుకుచున్నాము ఆయన మన హృదయంలోనే ఉన్నాడు అని కంప్లీటుగా మర్చిపోయాము. ఒకవేళ పెద్దలు చెప్పినా, శాస్త్రం చెప్పినా దానిని గ్రహించే బుద్ధి మనకు లేదు ఎందుచేతనంటే మన బుద్ధి కలుషితం అయిపోయింది. వ్యక్తిగతమైననేను లేనేలేదు. అది ఉందని నీకు అనిపిస్తోంది అందువలన మరణానంతర జీవితం గురించి ఆలోచిస్తున్నావు. నీ దుఃఖానికి కారణం బయట లేదు, కర్తృత్వబుద్ధే నీ దుఃఖానికి కారణం. కర్తృత్వబుద్ధి జీవుడి లక్షణం, కర్తృత్వబుద్ధిని పెంచేవాడు కూడా జీవుడే. దానిని పెంచేసి దానివలలో పడతాడు. వాడి సంకెళ్ళు వాడే వేసుకొంటున్నాడు. సంకెళ్ళు వేసుకోవటం తెలిక అందులోనుండి బయట పడటం కష్టం. మీరు పెద్ద తెలివైన వారము అని అనుకోవద్దు. తెలివితేటలు మంచివే కాని అతి తెలివి వలన మోక్షం రాదు అని భాగవతంలో చెపుతాడు. మీ తెలివి ఎంత, మీరు ఎంత, మీ తెలివితేటల వలన మోక్షం రాదు. మీ తెలివితేటల వలన మోక్షం వస్తుందనుకొంటే గజేంద్రమోక్షంలో ఏనుగుకు పట్టినగతే పడుతుంది. మొదట ఏనుగు తనబలం వలన బయటకురాగలను అనుకొంది. కాని తన తెలివివలన, బలం వలన బయటకు రాలేను నాబలం సరిపోదు అని దానికి అర్థం అయినతరువాత ఈ మొసలి బారినుండి రక్షింపబడాలంటే నారాయణుడిని ఆశ్రయించాలి అని గ్రహించి నారాయణ స్మరణ

చేసింది. మన తెలివి వలనే తరించగలము అనుకొంటే తనబలం వలననే మొసలి బారినుండి రాగలను అని ఆ ఏనుగు పోరాడి పోరాడి ఎంతో బాధపడిందిగాని అందులోనుండి బయటకు రాలేకపోయింది మనగతికూడా అంతే. ఎంతసాధన చేసినా సాధన ఒక్కటే సరిపోదు, నీ తెలివి ఒక్కటే సరిపోదు, భగవదనుగ్రహం ఉండాలి.

మనకు విరోధులు ఎవరూ బయటలేరు. మన తలంపులే, మన వాసనలే మనకు విరోధులు. ఇతరుల సమస్య మనకువద్దు. మన తలంపుల నుండి, వాసనల నుండి మనం విడుదల పొందితే ఈ క్షణంలోనే మనకు నిర్వాణసుఖం, పూర్ణశాంతి మనచేతికి అందుతుంది. నేను ఆత్మను, కాని ఆత్మయందు మనస్సును ఆరోపించుకొంటున్నాను, దేహాన్ని ఆరోపించుకొంటున్నాను, విషయాలను ఆరోపించుకొంటున్నాను. నేను ఆత్మనే అయినప్పటికి దానిమీద ఆరోపించుకొనే విషయాలు నేను అనుకోవటం వలన దుఃఖం వస్తోంది. ఈ క్లూ బాగా అర్థం చేసుకోవాలి. ఆరోపణబుద్ధివలననే దుఃఖం వస్తోంది, ఆరోపణబుద్ధి తీసి ఒక ప్రక్కన పెడితే దుఃఖం లేదు. తాను ఆత్మే అయినప్పటికి తాను దేహమాత్రుడను అనుకొంటాడు, దేహం మరణించిన తరువాత తాను ఉండను అనుకొంటాడు. ఆ ఉండను అనుకొనే తలంపు వలన దుఃఖం వస్తోంది. ఆ తలంపే మనకు శత్రువు అందులోనుండి విడుదలపొందితే ఇంక దుఃఖం లేదు. చావులు, పుట్టుకలు, ఇష్టాలు, అయిష్టాలు, రాగద్వేషములు, ఇతరలోకాలు ఇవన్నీ మనస్సు కల్పించినవే. మనస్సు కల్పించేది అంతా భ్రమే. మనస్సు ఏ విషయాలను అయితే కల్పిస్తోందో అందులోనుండి బయటపడితేగాని నీకు నిజం తెలియదు. నువ్వు కాని విషయాల నుండి వేరుపడితేగాని నువ్వు ఏదైతే అవునో అది నీకు తెలియదు. వ్యక్తి భావన విడిచిపెట్టకుండా నీకు జ్ఞానం ఎలా కలుగుతుంది. అవినయం రాకుండా చూసుకో, గర్వం రాకుండా చూసుకో. ఏవిషయం వలన అయినా మీకు గర్వం వస్తే, అవినయం వస్తే మీ స్వరూపానికి మీరు దూరమవుతారు. జ్ఞానం కావాలంటే విషయాన్ని అవగాహన చేసుకొనే శక్తి ఉండాలి. నీ మనస్సు పవిత్రంగా ఉంటే అవగాహన చేసుకొనే శక్తి వస్తుంది. యుద్ధానికి వెళ్ళేటప్పుడు సైనికుడు తుపాకి పట్టుకొని వెళతాడు. అలాగే నీవు ఆత్మానుభవం పొందాలంటే బుద్ధి సూక్ష్మతఅనే తుపాకిని చేతితో పట్టుకొని ప్రయాణం చేయాలి. శరీరం చనిపోయిన తరువాత పునర్జన్మ ఉందా, లేదా అని అడుగుతున్నారు. అజ్ఞానానికి పునర్జన్మ ఉంటుందిగాని జ్ఞానానికి పునర్జన్మలేదు. జ్ఞాని ఈ శరీరంలో ఉండగానే, ఈ శరీరానికి మరణంరాకముందే పుణ్యాన్ని, పాపాన్ని దాటి వెళ్ళిపోతాడు. వాడికి పునర్జన్మ ఏమిటి?

వాడికి ప్రయాణాలు ఉండవు. ఇప్పుడు ఈ జన్మలో నీవు ఎవరో నీకు తెలియదు. రాబోయే జన్మ గురించి ఆలోచించటం ఎందుకు? ముందు వర్తమానకాలాన్ని సద్వినియోగం చేసుకో. ఈ దేహాన్ని ఈ కాలాన్ని వదిలేసి వచ్చే జన్మలో ఎక్కడకు వెళతాను, రాబోయే జన్మ ఎటువంటిది వస్తుంది అని ఆలోచించుకొంటూ కూర్చొంటే వర్తమానకాలం వృథా అయిపోతుంది, నీ శక్తి వృథా అవుతుంది, వ్యర్థమైన ఆలోచనలతో నీకాలాన్ని, శక్తిని పాడుచేసుకోవద్దు. మరణంలేని వస్తువు ఒకటి నీ హృదయంలో ఉంది. దేహం పడిపోకముందే దానిని పొందటానికి ప్రయత్నం చెయ్యి. ఈ జన్మలో దుఃఖం ఉంది అనుకో ఆదుఃఖం నుండి విడుదల పొందటానికి ప్రయత్నం చెయ్యి. ఏతలంపు వలన నీకు దుఃఖం కలుగుతోందో, ఏ తలంపు నిన్ను పీడిస్తోందో అందులోనుండి బయటకు రావటానికి ప్రయత్నం చేయాలిగాని వచ్చే జన్మగొడవ నీకు ఎందుకు? కర్మానుసారం ఏదో జన్మ వస్తుంది. ఎందుకు లేనిపోనివి ఊహించుకొంటావు. భగవంతుడు మీద భారం వేస్తే ఎంతదుఃఖం ఉన్నా కాలిబూడిద అవుతుంది. భగవంతుడి మీద భారం వేయటం మానివేసి మా తెలివి తేటలవలన తరిస్తాము అనే గొడవలలోనికి వెళ్ళకండి అవిద్యలోనికి కూరుకొని పోతారు. భగవంతుడి మీద భారం వేసి జీవిస్తే జీవయాత్ర సుఖంగా నడిచిపోతుంది, పూర్వజన్మ సంస్కారములనుండి తొందరగా విడుదల పొందుతావు. తను ఎవడోతనకు ఎంతకాలం అయితే తెలియటంలేదో, ఆత్మకు సంబంధించిన మరుపు ఎంతకాలం అయితే ఉందో వాడు నేను పుడుతున్నానని, నేను చనిపోతున్నానని ఇలా అనుకొంటూనే ఉంటాడు, ఇలా యాత్రసాగిపోతూ ఉంటుంది. ఏనుగు చెవిని ఎప్పుడూ ఆడిస్తూ ఉంటుంది. నీ మనస్సు కూడా ఏనుగు చెవిలాగ ఎప్పుడూ ఆడుతూ ఉంటుంది. అభ్యాసం లేకుండా, వైరాగ్యం లేకుండా ఆ ఆటను నీవు అరికట్టలేవు అని భగవంతుడు చెపుతున్నాడు. నువ్వు ధ్యానాన్ని ఆశ్రయించు, వివేకాన్ని ఆశ్రయించు, సత్పురుషులను ఆశ్రయించు, వైరాగ్యాన్ని నిరంతరము ఆశ్రయించు దేని వలన అయితే నీకు ఆత్మానుభవం కలుగుతుందో ఆ విషయాలిన్నింటిని ఆశ్రయించి ఆత్మానుభవం పొందు అని భగవంతుడు చెపుతున్నాడు.

ఏదైతే నేను, నేను అనుకొంటున్నావో ఆ ప్రథమ తలంపును ధ్వంసం చేయాలి. దానిని ధ్వంసం చేస్తేగాని నీవు చావుపుట్టుకలు లేని స్థితికి ఎదిగి వెళ్ళలేవు. దానిని ధ్వంసం చేసి అమృతస్థితిని పొందుదాము అనే తలంపే నీకు రావటం లేదు. మోక్షం వైపుకు నీ

మొఖం తిరగటం లేదు. మరల జన్మ ఎటువంటిది వస్తుంది, ఆ జన్మలో ఎటువంటి భోగాలు మనకు వస్తాయి ఈ గొడవలే గాని హృదయంలో ఉన్న మహా వెలుగును ఎలా పొందాలి, దానిని ఎలా గ్రహించాలి అనే ఆలోచనే నీకు లేదు. పునర్జన్మ గురించి ఆలోచిస్తున్నావు లోపల ఉన్న పరమాత్మను మర్చిపోతున్నావు. ఈ శవమే నువ్వు అనుకొంటున్నావు. మరణించటం, జన్మించటం ఇదేపని. ఈ చక్రంలోనుండి బయటపడాలంటే నీకు ఇష్టం ఉన్నా లేకపోయినా ఆత్మను తెలుసుకోవలె, చైతన్యాన్ని అవగాహనలోనికి తెచ్చుకోవలె అందులో నీవు స్థిరపడాలి. ఈ విషయం ముందు నీవు అర్థం చేసుకోవాలి. నీ పాడు బుద్ధి వలన విషయం అర్థంకాదు. ఏకాగ్రమైన బుద్ధి, నిశ్చలమైన బుద్ధి, పవిత్రమైన బుద్ధి లేకుండా విషయం అర్థం కాదు. నువ్వు ఎవరో నీవు మర్చిపోవటం వలన ఎన్నో జన్మలు ఎత్తినట్లు మరణించినట్లు జన్మించినట్లు నీకు అనిపిస్తోంది. ఇవి అన్నీ వ్యవహారిక సత్యములే. చైతన్యం గురించి శ్రవణం చేయాలి, మననం చేయాలి, అందులో జీవించాలి. అలా జీవించగల్గితే రాత్రి వచ్చిన కలలు నిజంకాదు అని మెలుకువలోనికి వచ్చినవాడు ఎలా అనుకొంటాడో అలా జ్ఞానం పొందినవాడికి ఈ జన్మలు, చావు పుట్టుకలు నిజంకాదు అని వాడికి అనుభవంలోనికి వస్తుంది.

నువ్వు ఆత్మవే. కాని అది నీకు తెలియటం లేదు. తెలియని వాడు తెలియనట్లు ఉంటే ఫరవాలేదు. దేహాన్నే ఆత్మ అనుకొంటున్నాడు. మొసలిని నమ్ముకొని నదిని దాటటం ఎటువంటిదో నిరంతరం దేహమే నువ్వు అనుకొని, దేహమే సర్వస్వం అనుకొని మోక్షం పొందుదామనుకోవటం కూడా అటువంటిదే. ఇది ఆత్మ, ఇది దేహం, ఇది జ్ఞానం, ఇది అజ్ఞానం అని విడదీసుకోవటం నీకు తెలియటం లేదు. నువ్వు వివేకవంతుడిగా ఉండు. అప్పుడు ఇది ఆత్మ ఇది అనాత్మ అనేవిచక్షణ నీకు కలుగుతుంది. నిందను, స్తుతిని సమానంగా తీసుకోవాలి. వాటిని సమానంగా తీసుకోనే బుద్ధి నీకు లేనప్పుడు నీకు అమృతానుభవం కలుగదు. నిందను, స్తుతిని తీసుకొని వెళ్ళి నిప్పులో వెయ్యి, అవి కాలిపోతాయి అది కూడా యజ్ఞము అని చెప్పాడు. మనం సాదనచేసి, ప్రయత్నం చేసి, ఈశ్వరానుగ్రహంవలన ఆత్మానుభవం పొందాలి కాని చనిపోయి తిరిగి కొత్త దేహంలోనికి వెళ్ళినంత మాత్రంచేత ఆత్మానుభవం కలుగదు. కొత్త దేహంలోనికి వెళ్ళినంతమాత్రంచేత మానవ స్వభావంలో మార్పురాదు, స్థలం మారినంతమాత్రం చేత స్వభావంలో మార్పురాదు. జీవించి ఉండగా సాధనచేసి స్వభావంలో మార్పు తెచ్చుకోవాలి. మానవుడికి అన్నింటికంటే తన స్వభావం మార్చుకోవటం చాలా కష్టం. నువ్వు ఏకాంతంగా

కూర్చుని ఏ తలంపు అయితే నిన్ను బాధిస్తోందో జాగ్రత్తగా పరిశీలించుకొని ఆ తలంపు నుండి బయటపడటానికి ప్రయత్నించు. అదే సాదన. దేహానికి ఏ విషయాలయితే నిన్ను బంధిస్తున్నాయో ఆ విషయాల నుండి విడుదల పొందటానికి ప్రయత్నించు. అదే సాధన. జనన మరణాలు, లాభనష్టాలు, పురస్కారాలు, తిరస్కారాలు ఇవి అన్నీ దేహానికి సంబంధించినవి. వీటికి ఆత్మకి ఏమీ సంబంధం లేదు. ఇది గ్రహించటానికి నీకు పుణ్యబలం ఉండాలి. నిజం నీ హృదయంలోనే ఉందికాని అది నీచేతికి అందటానికి ఎన్ని జన్మలు పడుతుందో, ఎన్ని పుణ్యకర్మలు చేయాలో. వర్తమానకాలాన్ని పట్టించుకోండి మీ చేతిలో ఉన్న కాలాన్ని విడిచిపెట్టవద్దు. నేను అనే తలంపు ఎక్కడ నుండి వస్తోందో చూసుకోండి. వాడే జీవుడు. విచారణ చేస్తే జీవుడు లేడు. నేను అనే తలంపువచ్చినప్పడు లోకం తలంపు వస్తోంది, లోకం తలంపు వచ్చినప్పడు దేవుడు తలంపు వస్తోంది. గాఢనిద్రలో నేను అనే తలంపు లేదు అక్కడ నీకు ఏ గొడవలేదు. నువ్వుకాని దాని గురించి నిరంతరం ఆలోచించి కాలంపాడుచేసుకొనే బదులు ఏదైతే అవునో దాని గురించి ఆలోచించి దానిని పొందటానికి ఎందుకు ప్రయత్నం చేయకూడదు. జాగ్రదవస్థలో ఉన్నంతకాలం కానిదాని గురించి ఆలోచించి పాడైపోవటంకంటే ఏదైతే అవునో దాని గురించి ఆలోచించి దానిని పొందటానికి ప్రయత్నం చెయ్యి. గాఢనిద్రలో దేహం గొడవ లేదు, లోకం గొడవ లేదు, దేవుడు గొడవ లేదు కాని గాఢనిద్రలో నీవు ఉన్నావు. గాఢనిద్రలో నువ్వు ఏ స్థితిలో ఉన్నావో ఆస్థితి జాగ్రదవస్థలో కూడా ఉంది. ఆస్థితిని పట్టుకో నీ పని పూర్తి అయిపోతుంది. ఇది అంతా మాకు అర్థం కావటం లేదు ఏదో నారాయణ స్మరణ చేసుకొంటాము అని ఎవరైనా భగవాన్‌తో అంటే వెంటనే వాడికోసం ఆయన క్రిందకు దిగిపోయి అంతేచాలు మొదట ఒక అడుగు వెయ్యి. ముందు నామస్మరణ చెయ్యి అంతే చాలు అని చెప్పేవారు. అసలు నడక ప్రారంభించు ఒక రోజు వెనుక అయినా గమ్యం చేరతావు. ఒక్క అడుగుకూడా వెయ్యకుండా గమ్యం ఎలా చేరతావు. ముందు ఒక్క అడుగు అయినా వెయ్యి అంతేచాలు అనేవారు. సింహాన్నిచూసి జంతువులు ఎలా పారిపోతాయో నారాయణస్మరణ వలన విషయాలు అలా పారిపోతాయి. నేను ఏదో సాదన చేస్తున్నాను పవిత్రుడను కాలేక పోతున్నాను అని ఒక భక్తుడు రామకృష్ణుడిని అడిగాడు. నీవు ఏమీ చేయనక్కరలేదు పూర్తి విశ్వాసంతో

నారాయణస్మరణ చేసుకో చాలు అని రామకృష్ణుడు చెప్పాడు.

## కర్తృత్వభావన నశించటమే శరణాగతి

రాష్ట్రరాజధాని హైదరాబాద్ కుక్కట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీలో జూలై 30న రమణ భక్తులు ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక వేదికపై సద్గురు శ్రీ నాన్నగారు ప్రసంగించారు.

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భగవంతుడు మన హృదయంలోనే ఉన్నాడు. ఆయన యొక్క విలువ మనకు తెలియకుండా మిథ్యానేను అడ్డువస్తోంది. ఈ మిథ్యానేను నుండి విడుదల పొందటం మీదే మానవుడు సాధన అంతా గురిపెట్టాలి. మీరు ఏ మార్గంలో ప్రయాణం చేసినా మిథ్యానేను నుండి విడుదల పొందటం ప్రధానం. మిథ్యానేను నుండి విడుదల పొందకపోతే స్వరూప జ్ఞానం కలుగదు. మనం గ్రహించవలసిన విషయం ఏమిటి అంటే యజ్ఞాలు, యాగాలు ఎన్నిచేసినా అసలు మనస్సు బయటకు వెళుతోందా, లోపలకు వెళుతోందా అది చూసుకోవాలి. మనస్సు బాహ్యముఖానికి వెళితే అహంభావన అవుతుంది, మనస్సుకు అంతర్‌దృష్టి కలిగితే ఆత్మజ్ఞానం కలుగుతుంది. ఆత్మజ్ఞాన సముపార్జన అవసరం కాని దాని ప్రాముఖ్యత మనమెదుడుకు అందటం లేదు. శరీరం ఉండగా ఆత్మజ్ఞాన సముపార్జనకు కృషిచేసి ఆత్మానుభవం ఎవరైతే పొందారో వారు మరణించేటైము వచ్చినప్పుడు పశ్చాత్తాప పడనక్కరలేదు. శరీరం మరణించే టైముకు ఆత్మజ్ఞానం పొందకపోతే పశ్చాత్తాపపడాలి. ఆత్మానుభవం కలిగితే శరీరం మరణించాక రాకపోకలతో పనిలేదు. చైతన్యం గురించి శ్రద్ధగా శ్రవణం చేస్తూ ఉంటే దాని విలువ నెమ్మదిగా మనకు తెలుస్తుంది, నీ మనస్సు నెమ్మదిగా అణుగుతుంది. మనస్సు అణిగిపోతే నేను మీతో ఎలా మాట్లాడుతున్నానో, మీరు నాతో ఎలా మాట్లాడుతున్నారో అలా ఈశ్వరునితో కూడా మాట్లాడవచ్చు అని రామకృష్ణుడు చెప్పాడు. మిథ్యానేను బయటకు వచ్చి కాలి బూడిద అయ్యేవరకు ఏదోమార్గాన్ని ఆలంబనగా పెట్టుకొని కృషిచేయాలి. మిథ్యానేను పూర్తిగా నశించేవరకు దానిని నమ్మటానికి వీలులేదు. శరణాగతి అంటే నమస్కారం పెట్టటంకాదు. నిజమైన శరణాగతి అంటే హృదయస్థానమందు అహంభావన కరగాలి. ఏ హృదయంలో ఉండి ఈశ్వరుడు ఈశరీరం అనే బొమ్మలను నడుపుతున్నాడో ఆ హృదయ స్థానమందు మనస్సు స్థిరంగా ఉండాలి, అందులో మనస్సు కరగాలి. మంచి పనులు చేయండి అని మన పెద్దలు చెపుతారు. మంచి చేయటం ఎందుకు అంటే మంచి

చేయగా చేయగా మనస్సు అణుగుతుంది. మనస్సు అణగటం వలన హృదయంలో ఉన్న బంగారం దానికి అందుతుంది. నీ మనస్సును హృదయంలో నిలబెట్టి ఉంచలేకపోతే నిరంతరము భగవంతుని స్మరిచటం వలన మనస్సు అణుగుతుంది. భగవంతుడు మీకు మోక్షాన్ని ఇచ్చేటప్పడు మీలో అహంభావన ఉందా, లేదా ఇది ఒక్కటే చూస్తాడు. మీలో అహంభావన లేకపోతే మోక్షాన్ని ఇస్తాడు. మీరు లోపల అహంభావన పెట్టుకొని మంచిపనులు చేసినా మీకు మోక్షం రాదు.

భగవంతుడు ఒక్కడే నిజం. ఆ నిజాన్ని తెలుసుకోవటానికి నీ శరీరాన్ని, మనస్సుని ఉపయోగించుకోవాలి. జాగ్రత్తగా ఆలోచించండి, తగు మాత్రంగా తినండి. బాధ్యతా రాహిత్యంగా ఆలోచించవద్దు. మీరు నిష్కామకర్మచేసినా, లోకకళ్యాణం కోసం మంచిపనులు చేసినా మిధ్యానేను నుండి విడుదల పొందే ప్రయత్నంమీదే మీగురి ఉండాలి, అది మిస్ అవ్వకూడదు. కొంతమంది చిన్నమాట అంటే పడలేరు ఆత్మజ్ఞానం కావాలంటారు, సంసారంలోవచ్చే చిన్నచిన్న కష్టాలను తట్టుకోలేరు మాకు ఆత్మజ్ఞానం కావాలంటారు అది ఎలా సాధ్యమవుతుంది. మిమ్మల్ని స్తోత్రం చేసినా, విమర్శించినా మీ మనస్సు సమానంగా ఉండాలి, మనస్సు సమానంగా లేకపోతే మీకు తెలియకుండా అహంభావన పెరిగిపోతుంది. మొదట పూర్ణ శరణాగతి సాధ్యం కాకపోవచ్చు. పూర్ణ శరణాగతి సాధ్యం కాలేదని శరణాగతి భావన విడిచిపెట్టకు. పాక్షికంగా అయినా శరణాగతి పొందటానికి ప్రయత్నం చెయ్యి. అలా ప్రాక్టీసు చేయగా చేయగా పూర్ణ శరణాగతి లభిస్తుంది. పూర్ణశరణాగతి లభించిన తరువాత నీకు కర్తృత్వ భావన నశిస్తుంది అంటే నేను అనే తలంపు నశిస్తుంది. మీ సంసారంలో దుఃఖం ఉన్నట్లు మీకు కనిపించవచ్చు. అందులో దుఃఖం లేదు. దుఃఖకారణం బయటలేదు. నీలోపల కర్తృత్వ భావన రూపంలో ఉంది. శరణాగతి పొందటం వలన ఏకారణం వలన మీకు దుఃఖం వస్తోందో ఆకారణం నశిస్తుంది. కర్తృత్వ భావన ఎక్కువ ఉన్నవాడికి ఇతరులను అడిగి తెలుసుకోవాలనే బుద్ధికూడా వాడికి ఉండదు. జ్ఞానిని ఆశ్రయించి, వినయంగా ఉండి, తెలుసుకోవాలనే కాంక్షతో వారిని సమీపించి ఎప్పడు, ఎక్కడ, ఎలా అడగాలో పరిస్థితులు అర్థం చేసుకొని అడిగి ఆత్మజ్ఞాన సముపార్జన చెయ్యండి అని భగవంతుడు చెపుతున్నాడు. మోక్షాన్ని ఎవరూ కోరుకోరు, మంచి జన్మకావాలి అని కోరుకొంటారు ఎందుచేతనంటే మనకు దేహాభిమానం అంత బలంగా ఉంది. దేహం ఉంటే మనం ఉంటాము, దేహం

లేకపోతే మనం ఉండము అని మనకు భయం. దైనందిన జీవితంలో దేహబుద్ధి తగ్గించుకొంటూ రావాలి. శరణాగతి చెందినవాడు ఈశ్వరుని చేతిలో పనిముట్టుగా ఉంటాడు తనకంటూ ఏదీకావాలని ఈశ్వరుని ప్రార్థించడు. ఈశ్వరుడి దగ్గరనుండి ఏదీ ఆశించకు. ఆశించకపోతే ఏదీ రాదని అనుకోవద్దు. ఆశించి తెచ్చుకొన్నది బంధిస్తుంది, ఆశించకుండా వచ్చినది మనలను కలుషితం చెయ్యదు. శరణాగతి పొందినవాడు వాడి కుటుంబంలో ఒక వేళమంచి జరిగినా ఇది నీ ప్రసాదమే అంటాడు, ఒకవేళ చెడు జరిగినా ఇదీ నీ ప్రసాదమే అంటాడు. మనం ఏమి చేస్తాము అంటే మంచి జరిగితే ఇది ఈశ్వరానుగ్రహం అంటాము, చెడు జరిగితే ఈశ్వరుడు మాకు అన్యాయం చేసాడు అంటాము ఇది శరణాగతి లక్షణం కానే కాదు. మనకంటే మనగురించి భగవంతుడికి ఎక్కువ తెలుసు. మన భవిష్యత్‌కు ఏది మంచిదో భగవంతుడికి బాగా తెలుసు. మనకంటే భగవంతుడికి బాగా తెలుసు అనే జ్ఞానం మనకు లేదు. అందువలన మనకు దుఃఖం కలుగుతోంది. మీకు ఏదైనా చెడ్డ జరిగినా ఆచెడ్డ భవిష్యత్‌లో మంచికి దారి తీయవచ్చు. చెడ్డ జరిగినా శరణాగతి విడిచిపెట్టవద్దు. ఏదైనా చెడ్డ జరిగితే ఒక దేవుడిని వదిలేసి ఇంకో దేవుడిని పట్టుకొంటారు, దేవుడిని మార్చేస్తారు. అది తింగరతనం, క్రమశిక్షణ లేకపోవటం. ఇంతమంది దేవుళ్ళు లేరు ఉన్నది ఒక్కటే. ఎవరు ఏ రూపాన్ని ఆశ్రయించినా, ఏ నామాన్ని స్మరించినా పొందేది నన్నే అని భగవంతుడు గీతలో చెప్పాడు. మనం మోక్షం పొందటానికి ఒక్క దేవతానుగ్రహం చాలు. కొంతమందిని పరిస్థితులు అనుకూలంగా ఉంటే వారిని మనం పట్టుకోలేము, పరిస్థితులు అనుకూలంగా లేకపోతే వారు కృంగిపోతారు. ఇది భక్తుల లక్షణం కాదు. మనం ఎవరి ఇంటికైనా వెళ్ళాము అనుకోండి. వారు మర్యాద చేసినా, మర్యాద చేయకపోయినా ఒకేలాగ ఉండాలి. మర్యాద చేస్తే ఒకలాగ, మర్యాద చెయ్యకపోతే మరోలాగ ఉంటాము అనుకోండి అది భక్తుల లక్షణం కాదు అని చెపుతున్నారు రెండూ కూడా ఈశ్వర ప్రసాదంగా తీసుకోవాలి. నీ హృదయంలో ఉన్న సద్వస్తువు గుర్తింపు కోరుకోదు. మిథ్యానేను గుర్తింపు కోరుతుంది. నువ్వు గుర్తింపులు కోరుతున్నావు అంటే నీకు తెలియకుండా మిథ్యానేను బలపడుతుంది, నీ స్వరూపానికి దూరమవుతావు. నీ స్వరూపానికి ఎంతదూరం అవుతున్నావో భవిష్యత్ జన్మలలో అంత కష్టపడి, సాధన చేస్తేగాని దగ్గరకు రాలేవు. నీవు పనిచేసేటప్పుడు నిర్మలంగా ఉండాలి. నీకు ధైర్యం ఉండాలి అది కామ్‌గా ఉండాలి. నువ్వు లోపల భక్తి పెంచుకొంటూ, వైరాగ్యం పెంచుకొంటూ రావాలి పైకి అందరిలాగే కనబడాలి. భక్తి పేరుమీద ఇతరులకంటే

మనలో ఏదో ఆధిక్యత ఉందని అనుకొంటే నీవు పతనమవుతావు. అందరిలో ఉన్న వస్తువు ఒక్కటే. ఆ వస్తువును దర్శించనప్పుడు వారిలో కంటే నీలో ఏదో విశేషముందని నీకు అనిపిస్తుంది. నీ హృదయంలో ఉన్న భగవంతుడిని దర్శించనప్పుడు నీవు ఎంత ప్రయత్నం చేసినా ఈ సృష్టిని భగవత్ స్వరూపముగా చూడలేవు. నీకు భగవదనుభవం కలిగినప్పుడు ఈలోకం లోకంగా కనబడదు, భగవంతుడిగానే కనబడుతుంది.

ఈ దీనుని మీరు విడిచిపెట్టిన యెడల నన్ను ఎవరు రక్షిస్తారు అని అడుగుతున్నాడు. నేను నీకు సహాయం చేస్తాను, లేకపోతే చెయ్యను అన్న విషయంనాకు సంబంధించినది ముందు నువ్వు శరణాగతి చెందు. నీచేతిలో ఉన్నపని ఏదో నువ్వు చెయ్యి, శాంతిగా ఉండు. శాంతిలోనుండి శక్తి వస్తుంది. మీరు శాంతిగా ఉంటే ఇతరులకు శాంతిని ఇవ్వగలరు, మీకు శక్తి ఉంటే ఇతరులకు శక్తిని ఇవ్వగలరు. మీకు ఉన్నది ఇతరులకు ఇవ్వగలరుగాని మీకే లేనప్పుడు ఇతరులకు ఏమి ఇస్తారు. నారోజులు సుఖంగా వెళ్ళిపోతున్నాయి, నాకు కావలసినవి అన్నీ ఉన్నాయి అని ఒక భక్తురాలు భగవాన్‌తో చెపుతూ ఉంటే మీరు సుఖంగా ఉన్నానని చెపుతున్నారు కదా ఇంక ఏమీ అక్కరలేదు కదా అంటున్నారు భగవాన్. అదికాదు నాలో ఏదోలోటు ఉన్నట్లు, నా మనస్సులో ఏదో వెలితి ఉన్నట్లు నాకు అనిపిస్తోంది. ఎప్పుడైనా శాంతిగా ఉంటున్నాను. మరల ఆ శాంతి పోతోంది, శాంతి పెర్మనెంట్‌గా ఉండటం లేదు అని చెపుతోంది. బాహ్యంగా నీకు ఎన్ని సదుపాయాలు ఉన్నా, ఎంత సంపద ఉన్నా హృదయంలో ఉన్న నిజం నీకు అనుభవంలోనికి వచ్చే వరకు ఏదో వెలితి నిన్ను వెంటాడుతూనే ఉంటుంది. దైవానుగ్రహం నీకు అందేవరకూ నిజం ఏమిటో నీకు తెలియదు. అప్పటివరకు ఈ జన్మలోనే కాదు రాబోయే జన్మలోకూడా ఏదో వెలితి, ఏదో దుఃఖం నిన్ను వెంటాడుతూనే ఉంటుంది. మనం ఎంతో కొంత ప్రయత్నం చేస్తాము కాని మన ప్రయత్నం సరిపోదు. ఈశ్వరానుగ్రహం కలిగితేగాని ఆత్మానుభవం కలుగదు.

దేహం యొక్క ప్రారబ్దాన్ని బట్టి ఒకోసారి అనుకూల పరిస్థితులురావచ్చు, ఒకోసారి రాకపోవచ్చు దేహాన్ని ప్రారబ్దానికి విడిచిపెట్టు, నీ పని ఏదో నువ్వు చేసుకో. ప్రారబ్దాన్ని బట్టి ఈ దేహం ఎప్పుడు చనిపోవాలో అప్పుడు చనిపోతుంది. మొదటి శ్వాస, చివరి శ్వాస మనకు తెలియదు. శాశ్వతమైన శాంతి నీకు అందలేదు అంటే నీ లక్ష్యం పూర్తికాలేదు అని అర్థం. నీవు నీ హృదయంలో ఉన్న సద్వస్తువును పొందేవరకు నిజమైన

శాంతి నీకు దొరకదు, ఆ సద్వస్తువును పొందితేగాని నీవు గమ్యం చేరవు. సహనం నేర్చుకోవాలి. సహనం వలన సాత్వికబుద్ధి వస్తుంది. సాత్వికబుద్ధివలన మనస్సు హృదయం యొక్క లోయలలోనికి ప్రవేశించగలదు. బాహ్యంగా పరిస్థితులు బాగానే ఉన్నాయి కాని నా మనస్సు విషయాలను చింతించి రోడ్డు మీద దుమ్ము అంతా పోగుచేసుకొంటోంది. ఇది నాతలరాత, నా విధి అయి ఉండవచ్చు అని భగవాన్‌తో ఆ భక్తురాలు చెపుతున్నారు. నా తలరాత, నావిధి అంటున్నావు చైతన్యానికి విధి లేదు. ఈ విధి, తలరాత అంతా మిధ్యానేనుకే. నా విధి అంటున్నావు ఆనేనును తీసేస్తే ఏమీ లేదు. నువ్వు చెప్పే ఆనేను కూడా దొంగనేనే. ఈ మిధ్యానేను ఎప్పుడు ఏది తీసుకొని వస్తుందో తెలియదు. నేను పెద్దవాడను అయిపోయాను, స్వతంత్రుడను అయిపోయాను అనుకోవద్దు. ఈ మిధ్యానేను కాలిబూడిద అయ్యేవరకూ ఈశ్వరుని పాదాలు విడిచిపెట్టవద్దు. ఈశ్వరానుగ్రహం లేకపోతే మాయ దారి ఇవ్వదు, మాయ దారి ఇస్తేగాని మీరు తరించరు. చివరి శ్వాస వరకు ఈశ్వరుడి మీద విశ్వాసం కాపాడుకొంటూ రావాలి. కొంతమంది అదృష్టం, దురదృష్టం అంటూ ఉంటారు. పుణ్యఫలితం అదృష్టం, పాపఫలితం దురదృష్టం. ఇవి రెండూ మిధ్యానేనుకే అనుభవిస్తే రెండూపోతాయి. భగవంతుడిపట్ల నిజమైన ప్రేమ ఉంటే, విశ్వాసం ఉంటే ఈ విధిగొడవ, రాతగొడవ ఉండదు. విశ్వాసం లేక ఈ గోల అంతా వస్తోంది. భగవంతుడు మన హృదయంలో ఉన్నాడు, ఆయనే మనకు గతి. ఆయన ఎక్కడో వైకుంఠములో ఉన్నాడు అనుకోవటంకంటే భగవంతుడు మన హృదయంలోనే ఉన్నాడు, మనకు వచ్చే ప్రతీతలంపును చూస్తున్నాడు, మన మాటలు వింటున్నాడు అనే ఎరుకతో బ్రతకటం మంచిది.

శరణాగతి పొందమంటున్నారు నా అహంకారములో ఉన్నకారం అడ్డువస్తోంది అని చెపుతున్నారు. వస్తే రానియ్యి ఏదైతే అడ్డువస్తోందో దానితో యుద్ధం చేద్దాము, పారిపోవటానికి ప్రయత్నం చేయకు. కారం ఎక్కువ ఉంటే ఉండనియ్యి. నువ్వు భయపడకు. నువ్వు చేసే ప్రయత్నం మటుకు మానవద్దు. ఈశ్వరుడి మీద విశ్వాసం విడిచిపెట్టకు. కారం దాని ప్రయత్నం అది మాననప్పుడు నీ ప్రయత్నం నీవు ఎందుకు మానాలి. నీ సాధనను విడిచిపెట్టవద్దు. ఈశ్వరుడి మీద పరిపూర్ణమైన విశ్వాసం ఉంటే, ఆ విశ్వాసం చలించకుండా ఉంటే నీ మనస్సు కండిషన్‌లో పడిపోతుంది. నువ్వు ప్రయత్నం చేసేటప్పుడు ఏకాగ్రంగా చెయ్యి, నిండుగా చెయ్యి. భక్తి అంటే ఈశ్వరునికి మనకి ఉన్న అనుబంధం. ఈశ్వరుని శరణు వేడుకో. ఈశ్వరుని సహాయం అర్థించు. కారాన్ని

తొలగించుకోవటం నీకు అసాధ్యం అవ్వవచ్చుకాని నీవు ఏదేవునికైతే శరణాగతి చెందావో ఆయనకు అసాధ్యం కాదు. ఈశ్వరుని పట్ల నీకు ఉన్న భక్తి నిర్మలంగా, నిరాడంబరంగా, నిశ్చలంగా ఉండాలి. నీకు ఆధ్యాత్మిక బలం లేనప్పడు నీవు సంఘానికి, దేశానికి ఏమి సహాయం చేయగలవు. నీలోపల ఉన్న బంగారమే అన్నింటికంటే మహాబలమైనది. బలం బయట ఏమీలేదు, నీలోపలే ఉంది. బలం బయట ఉంది అనుకుంటే అది బలంకాదు వాపు. అన్ని లాభాలలోనికి ఆత్మలాభం గొప్పది. దేహబుద్ధి ఉన్నవాడికి నమస్కారం పెడితే అది ఆదేహానికే అందుతుంది. దేహబుద్ధి లేనివాడికి నమస్కారం పెడితే దేహబుద్ధి లేనివాడి దేహం ఈశ్వరుడి స్వాధీనంలో ఉంటుంది కాబట్టి ఆ నమస్కారం ఈశ్వరుడికి అందుతుంది. అక్కడ నుండి కృప వచ్చినప్పడు నదికి వరద వచ్చినపుడు ఆ ప్రవాహం ఎలావస్తుందో అలాగ కృపాప్రవాహం వచ్చినప్పడు అందులో ఈ కారాలు, దుఃఖం, అశాంతి ఈ గందరగోళం అంతా కొట్టుకొని పోతుంది. కారం ఎంతకాలం అయితే అడ్డువస్తోందో అంతకాలం నీ ప్రయత్నం విడిచిపెట్టవద్దు. ప్రయత్నం చేయగా చేయగా ఈశ్వరుడు కలుగుజేసుకొంటాడు. కారం ఎప్పడు జారిపోతుందో ఆజారిపోయే మధురక్షణం వచ్చినప్పడు నీకు తెలియకుండానే అది జారిపోతుంది. ఎప్పడైతే అది జారిపోయిందో దానిని అంటుకొని ఉన్న దుఃఖం కూడా నశిస్తుంది. అప్పడు దుఃఖం లేని స్థితికి ఎదిగి వెళతావు అప్పడు దేహం ఉన్నా ఒకటే లేకపోయినా ఒకటే ఆధ్యాసే నీకు ఉండదు. ప్రాణం పోయేటైముకి ఆత్మలాభం పొందరు అనుకోండి, మిగతాలాభాలు అన్నీ పొందారు అనుకోండి మీకు చివరకు మిగిలేది సున్న. ఆత్మలాభం యొక్క ప్రాముఖ్యత తెలుసుకోండి. మీ శారీరక ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం కాపాడుకొంటూ ఆత్మవిద్యను సంపాదించి దుఃఖం లేనిస్థితిని పొందండి. ప్రతీచిన్న విషయానికి వికారం తెచ్చుకోవద్దు. నిర్వికారంగా ఉండండి. నీ ప్రారబ్దంలో ఉన్నదానిని కాదనకు, లేనిది కావాలి అనుకోకు. ఈశ్వరుడు జీవులను వారివారి ప్రారబ్దంననుసరించి నడిపిస్తున్నాడు. జరుగవలసినది జరిగే తీరును, జరుగరానిది ఎవరు ఎంత ప్రయత్నం చేసినా జరుగనే జరుగదు. ఇది నిశ్చయము.

**ధనం ఎక్కువ ఉందని అవసరాలు పెంచుకోకూడదు. ధనాన్ని సమాజ శ్రేయస్సుకు ఉపయోగించాలి.**

పశ్చిమగోదావరి జిల్లా పోడూరులో ఆగస్ట్ 10న రుద్రరాజు విజయరామరాజు, కృష్ణవేణి దంపతులు ఏర్పాటు చేసిన వేదికపై సద్గురు శ్రీ నాన్నగారు ప్రసంగించారు.

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మహాత్ముల సమక్షాన వాసనలు అణుగుతాయి. మీరు చేసుకొనే సాదన సరేసరి. మీరు సాధనారత్నాలుగా ఉండాలి. సాధనలో రత్నాలుగా ఉండాలంటే మనం కాలం పాడుచేసుకోకూడదు. ఇప్పటికే మనకు చాలా టైము అయిపోయింది. మనందరము జీవితంలో మధ్యాహ్నం 12 గంటలు దాటి 2 గంటలు, 3 గంటలు టైములో ఉన్నాము. 6 గంటలకు సూర్యుడు అస్తమిస్తాడు. అందుచేత కాలాన్ని పాడుచేసుకోవద్దు. కాలం విలువ మనకు తెలియటం లేదు. మీరు డబ్బును ఎలా మేనేజ్ చేసుకొంటున్నారో అలాగే టైమును మేనేజ్ చేసుకోవటం నేర్చుకోవాలి. టైము మేనేజ్‌మెంట్ తెలిసినవారు సాదన సరిగా చేయగలరు. ధనం ఎక్కువ ఉందని అవసరాలు పెంచుకోకూడదు. బట్టలవిషయంలోగాని, తిండి విషయంలోగాని, కుటుంబవిషయాలలోగాని తగుమాత్రంగా ఉండాలి. అవసరాలు పెంచుకొంటే ఇబ్బందులు వస్తాయి. అవసరాలు పెంచుకొంటే ఆధ్యాత్మిక ఆనందానికి దూరమవుతారు. ఎవరైతే సాధన బాగా చేస్తున్నారో, ఎవరైతే ఆధ్యాత్మికంగా పురోగతి పొందుతున్నారో వారు విషయానందానికి దూరమవుతారు, ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందుతారు.

మనకు ముందు నేను అనే తలంపు వస్తుంది. అది వచ్చాక ఇతరతలంపులు వస్తాయి. ఆ మొదటి తలంపు నీకు అర్థం కాకపోతే పునర్జన్మలు వచ్చేస్తాయి. మనం ఎంతసేపు ఇతరులను అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేస్తాముగాని ఈ నేను అనే తలంపును అర్థం చేసుకోవటానికిగాని, దాని మూలం తెలుసుకోవటానికిగాని ప్రయత్నం చేయటం లేదు. ఇది దురదృష్టం. ఒకవేళ మనం ప్రయత్నం చేయాలని అనుకొన్నా మనం చేయలేము ఎందుచేతనంటే మనకు పుణ్యబలం తక్కువ, వివేకం తక్కువ. మనం మందులు వేసుకొని రోగాన్ని అణిచి ఉంచాము అనుకోండి మందులు మానివేస్తే రోగం తిరిగి వచ్చేస్తుంది. ఈ మూలతలంపుకూడా అటువంటిదే. పూజచేసి, జపంచేసి దానిని అణిచి ఉంచాము అనుకోండి అప్పుడు మీకు శాంతిగా ఉన్నట్లు అనిపిస్తుంది. మరల అది విజృంభిస్తుంది. మూలతలంపు అణిగి ఉండటం వేరు, నశించటం వేరు. అది పూర్తిగా వేరుతో సహా నశించాలి. జీవిత రహస్యం అంతా మూలతలంపులోనే ఉంది. అది మీకు అర్థం కాకపోతే భగవద్గీత చదివినా, ఉపనిషత్‌లు చదివినా మీరు అశాంతిలో పడికొట్టుకొంటూ ఉండవలసిందే, దుఃఖం మిమ్మల్ని విడిచిపెట్టదు. మనం ఇతరులను అనుకరించకూడదు. మన సమస్యలు ఏమిటో మనం అర్థం చేసుకొని ఆ మూలతలంపును పరిష్కారం చేసుకొనే విధానం చూసుకోవాలిగాని వారు ఇలా ఉన్నారు, వారు అలా ఉన్నారు అని ఇతరులను

అనుకరించకూడదు. మూలతలంపు పరిష్కారం అవ్వాలంటే కేవలం నీ తెలివి తేటలు సరిపోవు. నీవు పవిత్రుడు అయి ఉండాలి, పరిశుద్ధుడవు అయి ఉండాలి.

మనస్సు ఏదో గొప్పగా ఉంటుంది అని అనుకోవద్దు. మనస్సులో తలంపులు, స్నేహాలు, విరోధాలు, సుఖాలు, దుఃఖాలు, జనన మరణాలు దరిద్రం అంతా మనస్సులో ఉంది. శరీరంలో లేని చెడ్డ అంతా మనస్సులో ఉంది. శరీరం, మనస్సు అనే ఈ రెండు గెడపలు దాటకపోతే మనకు జ్ఞానం రాదు. తిండి విషయంలో జాగ్రత్తగా ఉంటే నీ శరీరం, మనస్సు స్వాధీనంలోనికి వస్తాయి. ఈ రెండూ కూడా పోయేవే. శరీరం నిప్పకు బలైపోతుంది, మనస్సు జ్ఞానానికి బలైపోతుంది. జ్ఞానం కలిగేవరకూ శరీరాన్ని, మనస్సును జాగ్రత్తగా ఉపయోగించుకోవాలి. మూలతలంపు రైలు ఇంజను వంటిది. ఇంజను కదిలింది అంటే దానికి తగిలించిన పెట్టెలు అన్నీ కదిలిపోతాయి. అలాగే ఈ మూలతలంపు కదిలింది అంటే పుణ్యం వచ్చేస్తుంది, పాపం వచ్చేస్తుంది, ఇతరలోకాలు, జన్మలు, రాగద్వేషాలు, విరోధాలు, స్నేహాలు, ప్రకృతిగుణాలు అన్నీ వచ్చేస్తాయి. ఎవరూ దీనిని ఆపు చేయలేరు. లోకంలో విషయాలు అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేస్తున్నాముగాని ఈ మూలతలంపు ఏమిటి అది ఎలా పనిచేస్తోంది అనిదాని గురించి అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేయటం లేదు ఎందుచేతనంటే మనకు ఆధ్యాత్మిక బలం లేదు. ఇతరులు ఎవరైనా నిన్ను విరోధి అనుకొన్నా ఫరవాలేదు, నీకు ఎవరూ విరోధులు ఉండకూడదు. విరోధులే ఆధ్యాత్మిక అభివృద్ధికి అడ్డువస్తారు. మంచి స్నేహమే బంగారం.

మహనీయుల సమక్షంలో వాసనలు అణిగి మనస్సు నిశ్చలమై సమాధిఅవస్థ వస్తుంది. మన బుద్ధి నిర్మలంగా ఉంటే, నిశ్చలంగా ఉంటే, రాగద్వేషములు తగ్గించుకొంటే సమాధిస్థితి కలుగుతుంది. మన బుద్ధిలో దోషాలు ఉంటే ఎంతసేపు పూజ చేసినా, జపం చేసినా సమాధి స్థితి రాదు. ఆధ్యాత్మికంగా అభివృద్ధి పొందండి అంటే అమాయకంగా ఉండమని కాదు, వివేకంగా తెలివిగా ఉండాలి. నువ్వు ఆలోచించి మాట్లాడాలి. ఆలోచించి మాట్లాడినా ఎప్పుడైనా పొరపాటు రావచ్చు, మాట్లాడితే పొరపాటు వస్తుంది అని మాట్లాడటం మానివేస్తే నువ్వు ఏమీ మాట్లాడకుండానే చస్తావు. అలాగే ఏదైనా పనిచేస్తే పొరపాటు వస్తుందని భయపడి అసలు పనిమానివేస్తే పనిచేయకుండా చనిపోతావు. అలాగేచేస్తే నీ జీవితం ఆధ్యాత్మిక అభివృద్ధికి ఉపయోగపడదు, నీ కుటుంబానికి ఉపయోగపడదు. రాగ ద్వేషాలను, పుణ్యపాపాలను ఇక్కడ వదలకపోతే

దేహం చనిపోయిన తరువాత మీరు ఎంతదూరం ప్రయాణం చేసినా, మీరు ఏ లోకంలో ఉన్నా అవి మీకూడా వచ్చేస్తాయి. పుట్టుకతో వచ్చిన శరీరాన్ని కాల్చటం తేలిక కాని పుట్టుకతో వచ్చిన బుద్ధిని మార్చటం చాలా కష్టం, ఎంతో సాధనచేస్తేగాని అది మారదు.

మనస్సు యొక్క చాపల్యం తగ్గాలంటే ఒక ఉపాయం ఉంది. మేము మంచి వారము అనుకోవద్దు, మేము చెడ్డవారము అనుకోవద్దు. మీ గురించి మీరు ఏమీ అనుకోవద్దు. ఒకవేళ మీరు ఏదైనా అనుకొన్నా అది నిజం కాదు. దేవుడు ఒక్కటే నిజం, దేవుడు ఒక్కటే సత్యం అనే భావనను అభ్యాసం చేస్తే విశాలమైన ఈ ప్రపంచం అంతా వచ్చి మన హృదయంలో కలిసిపోతుంది. అప్పుడు వేరుబుద్ధి నశిస్తుంది. వేరుబుద్ధి నశిస్తే ఎటుచూసినా శాంతే, ఎటుచూసినా ఆనందమే. ఈ లోకం అంతా ఈశ్వరుడిది. ఈ లోకానికి మనం ఎంతోకొంత ఉపయోగపడితే మనం ఈశ్వరానుగ్రహానికి పాత్రులవుతాము. భక్తునికి సరియైన అనుభవం, జ్ఞానం గురువు సమక్షంలో లభిస్తుంది. శరీరం చనిపోయిన తరువాత మన యాత్ర ముగుస్తుంది అని మనం అనుకొంటాము. మన దేహయాత్ర ముస్తుందిగాని జీవుడి యాత్ర ముగియదు. మరణానంతర జీవితం ఉంది అని గురువు సమక్షంలో నీకు స్ఫురిస్తుంది. అది గురువు యొక్క వైభవం. నీలోపల ఏమి ఉందో గురువు నీకు స్ఫురింపచేస్తాడు. అక్కడ నీ మనస్సును నిలబెట్టి ఉంచటానికి నువ్వు ప్రయత్నం చేయాలి. అలా ప్రయత్నం చేయగా చేయగా నీలోపల ఉన్న వస్తువు అనుభవైకవేద్యం అవుతుంది. గోడకు మేకుకొట్టినట్లు నీ మనస్సు హృదయంలో ఫిక్స్ అయితే కొంతకాలానికి జీవన్ముక్తుడవు అవుతావు. ఇంకవాడికి పునర్జన్మ ఉండదు. సాధన ఎంతవరకు అవసరం, ఎంతకాలం చేయాలి అని అడుగుతున్నారు. నీలోపల ఉన్న వాసనలు, సందేహాలు పూర్తిగా నశించేవరకు నీవు సాధన చేయవలసిందే నీ మనస్సును నమ్మటానికి వీలులేదు. మూలతలంపు నశించాలంటే నీ సాధనతోపాటు గురువు అనుగ్రహం అవసరం. విశ్వాసం విడిచిపెట్టకుండా ఉంటే అనుగ్రహం ఏదోరోజు వస్తుంది. ఆయన స్వరూపమే అనుగ్రహం. మిమ్మల్ని ఎవరైనా పొగిడినా అదీ శబ్దమే, ఎవరైనా విమర్శించినా అదీ శబ్దమే. రెండూకూడా తీసుకోకూడదు. పొగిడితే ఆశబ్దం తీసుకొంటే మీరు పొంగిపోతారు, గర్వం వస్తుంది, విమర్శిస్తే ఆశబ్దం తీసుకొంటే కృంగిపోతారు, దుఃఖం వస్తుంది. ఇవి రెండూ కూడా మీ మనస్సుకు చెడ్డే. ఎందుకు చెడ్డ అని చెపుతున్నాము అంటే వీటివలన మూలతలంపుకు ఎక్కువ ఆహారం సప్లయి అవుతుంది. దేనినైతే పోగొట్టుకోవాలో అది బలపడుతుంది.

05-09-2000

మాకు ఇలా జరుగుతోంది, అలా జరుగుతోంది అంటారు. జరిగేది దేహానికే, దేహమే నీవు అనుకొంటున్నావు కనుక దుఃఖం వస్తోంది. భగవంతుడితో అనుబంధం పెట్టుకొంటే దేహంతో అనుబంధం తగ్గిపోతుంది. భక్తుడు ఒకటి నేర్చుకోవాలి లౌకికులను అనుకరించకూడదు. వారిని అనుకరిస్తే నువ్వు సంపాదించినది అంతా పోతుంది. మనం ఎంతసేపు మోక్షాన్ని గమ్యంగా పెట్టుకోవాలి. ఎవరో విమర్శిస్తున్నారు అని నీవుకూడా విమర్శిస్తే నీవు వారు సమానమేకదా, నీవు భక్తుడవు ఎలా అవుతావు. భక్తిలో అభివృద్ధి పొందాలంటే మనకు చేతనయితే మంచిచేయటం, మంచిచేసే ఓపిక లేకపోతే ఊరక ఉండటం. పుష్పాలలో ఉన్న వాసనను గాలి ఎలా మోసుకొనివస్తుందో అలాగే మీకు ఏ ఇంద్రియానికి ఏ వాసన ఉందో ఆ వాసనను మీ శరీరం పోయిన తరువాత జీవుడు మోసుకొని పోతాడు అని భగవంతుడు చెపుతున్నాడు. శరీరాలు ఎక్కడ ఉన్నా గురువుతో మానసిక అనుబంధం ముఖ్యం. ఈ శవం ఎక్కడ ఉన్నా నీమనస్సు అణిగితే, నీ మనస్సు నశిస్తే ఎక్కడ చూసినా శాంతే. ఈ సృష్టినంతా కౌగిలించుకోవాలనిపిస్తుంది, నీకు సృష్టితో సన్నిహిత సంబంధం ఏర్పడుతుంది. హృదయంలో శాంతి కుదిరితే నీ బిడ్డతో నీకు ఎటువంటి సంబంధం ఉంటుందో ఈ సృష్టితో కూడా అటువంటి సంబంధం ఏర్పడుతుంది. మనం పొందవలసింది మనహృదయంలో ఉంది. దానిని పొందటానికి ఏ విషయాలు అడ్డువస్తున్నాయో వాటిని తీసి ఒక ప్రక్కన పెట్టటమే సాధన యొక్క ప్రయోజనం. నీ హృదయంలో ఉన్న అంతర్యామిని గ్రహించగలిగినప్పుడు నీవు ఎక్కడ ఉన్నా ఫరవాలేదు, స్వర్గరాజ్యంలో ఉన్నట్లు ఉంటుంది.

నీవు ఏ ప్రకృతిని దాటి వెళ్ళాలనుకొంటున్నావో ఆ ప్రకృతిని దాటి ప్రశాంతంగా, ఏకాంతంగా గురువు ఉంటాడు. నీవు ఏ తలంపులనుండి బయటపడాలనుకొంటున్నావో ఆ తలంపులు లేకుండా ఉంటాడు, నీవు ఏదైతే పొందాలనుకొంటున్నావో అది అయి ఉంటాడు వాడు గురువు. వాడితో సహవాసం అవసరం అని అందుకే శాస్త్రం చెపుతోంది మహాత్ములతో సాంగత్యం వలన, గురువుతో సాంగత్యం వలన నీవు కూడా ప్రశాంతంగా ఉండగలుగుతావు. గురువే మీకు పెద్ద బంధువు. ఆయన ఆత్మలకు ఆత్మ, బంధువులకు బంధువు, సాధువులకు సాధువు, తల్లికి తల్లి. ఇక్కడ ఉన్న తల్లి బొమ్మతల్లి ఆయనే మనకు నిజమైన తల్లి. తెరమీద బొమ్మలు ఎటువంటివో ఈ శరీరాలు కూడా అటువంటివే. ఆత్మ లేదు, చైతన్యం లేదు, భగవంతుడు లేడు అంటారు. అది లేకుండా ఎవరైనా ఉండగలరా?

అది ఉండటం వలననే అందరూ ఉన్నారు. అది ఉండటం వలననే వారు ఉన్నారు అని తెలియకపోవటం వలన అలా అనుకొంటున్నారు. ఈ సృష్టిలో ఉన్న అన్నింటికంటే అందమైనది నీ హృదయంలో ఉన్న సత్యం. దాని సౌందర్యం చూడటానికి నీ రెండుకళ్ళు సరిపోవు. సత్యమే ఆనందం, సత్యమే ఉండటం, శరీరం మరణించిన అది ఉంటుంది, అదే నీవు. సత్యంతో కలిసి ఉండటమే సత్సంగం. సత్యంతో కలిసి ఉండలేకపోతే, ఆ హృదయంలో నీవు ఉండలేకపోతే సత్యానుభవం ఎవరికైనా ఉంటే వారు నీ ఎరుకలో ఉంటే వారిని గ్రహించి వారితో సహవాసం చేయుటం మంచిది. సత్పురుషులతో సహవాసం సంసారసాగరాన్ని దాటిస్తుంది. సత్పురుషుల సహవాసం లాంటిది మూడులోకాల్లో ఎక్కడా లేదు అని భగవాన్ చెప్పారు. రామరావణయుద్ధం ఇలా ఉంటుంది అని పోల్చటానికి వాల్మీకికి ఏమీ దొరకలేదు అందుచేత రామరావణయుద్ధం అంటే రామరావణయుద్ధమే అని చెప్పాడు. అలాగే సత్పురుషుల సహవాసంతో పోల్చటానికి ఈ ఋషికి కూడా ఏమీ దొరకలేదు అందుచేత సత్పురుషుల సహవాసం అంటే సత్పురుషుల సహవాసమే దానితో పోల్చటానికి అటువంటిది మూడు లోకాలలో లేదు అని చెప్పాడు. సజ్జన సాంగత్యాన్ని వెతుక్కొంటూ వెళ్ళు. ఆ అన్వేషణలో సత్యం వెంటనే అనుభవంలోనికి రాకపోయినా నీ మనస్సుకు అంతర్దృష్టి కలుగుతుంది. అంతర్దృష్టి నీకు ఆత్మజ్ఞానాన్ని పట్టి ఇస్తుంది. బయటచూపు వలన నీకు బయట వస్తువులు ఎలా కనిపిస్తున్నాయో లోపల చూపువలన లోపల ఉన్న వస్తువు నీకు గోచరమవుతుంది. లోపల ఉన్న వస్తువు గోచరమైన మరుక్షణం నీ బుద్ధికి దాని తాలుక సుఖం, శాంతి అందుతుంది. అప్పుడు పునర్జన్మలనుండి విడుదల పొందుతావు.

**కాలప్రవాహంలో అన్నిలాభాలు కొట్టుకొనిపోతాయి. ఒక్క ఆత్మలాభం మాత్రమే శాస్వతంగా ఉంటుంది.**

పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఆగస్ట్ 28న ప్రముఖ న్యాయవాది తాడిమళ్ళ జగన్నాధరావుగారు ఏర్పాటు చేసిన వేదికపై సద్గురు శ్రీ నాన్నగారు ప్రసంగించారు.

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మాకు భక్తి ఉంది కాని శాంతి ఉండటం లేదు కొద్దిసేపు శాంతిగా ఉంటుంది మరల అశాంతి వచ్చేస్తుంది అంటున్నారు. దీనికి గుణాలే కారణం. భక్తి నిర్మలంగా, నిశ్చలంగా, తీవ్రంగా ఉంటే ఇప్పుడే ఇక్కడే ఈ దేహంలో ఉండగానే మోక్షం వస్తుంది. గుణాలు అన్నీ

మనస్సులో ఉన్నాయి. మనకు రజోగుణం ఉన్నప్పుడు ఒకరకంగా, తమోగుణం ఉన్నప్పుడు ఒకరకంగా, సత్వగుణం ఉన్నప్పుడు ఒకరకంగా ప్రవర్తిస్తాము. మనం గుణాల స్వాధీనంలో ఎంతకాలం అయితే ఉంటామో అంతకాలం మనకు స్వేచ్ఛ ఉండదు. గుణాలు ఎటు ఆడమంటే అటు ఆడతాము. మనం సత్వగుణాన్ని అలవర్చుకోవాలి. సత్వగుణం సత్యంకాక పోయినా సత్యంవైపుకు దారి చూపిస్తుంది. పనిచేసి దాని ఫలితం ఎప్పుడు వస్తుంది అని ఎదురుచూసినా, మనం ఉద్రేకంగా మాట్లాడినా రజోగుణం పెరుగుతుంది. పనిచేసి మర్చిపోతే సత్వగుణం పెరుగుతుంది. మనమాట, మనం చేసేపని, మనకు వచ్చే తలంపులు దయాపూరితంగా ఉండాలి దానివలన సత్వగుణం అభివృద్ధి అవుతుంది. అన్ని లాభాలలోకి ఆత్మలాభం ఉత్తమమైనది. దానికి మించినలాభంగాని, దానితో సమానమైన లాభంగాని ఏదీలేదు. కాల ప్రవాహంలో అన్ని లాభాలు కొట్టుకొని పోతాయి కాని ఒక్క ఆత్మలాభం మాత్రం కొట్టుకొని పోదు, అది శాశ్వతమైనది.

నీకు లోపలనుండి ఏదైతే నేనుగా వ్యక్తమవుతోందో జీవుడు అను, మనస్సు అను, అహంకారం అను అది ఒక పెద్ద అబద్ధం అని భగవాన్ చెప్పారు. దానికి మించిన అబద్ధం ఈ సృష్టిలో ఏదీలేదు. ముందు ఇది మనకు అవగాహన అవ్వాలి. అవగాహనకూడా యోగంతో సమానము. ఇంట్లో పేచీలకు కూడా చాలావరకు అవగాహన లోపమేకారణం. సబ్జెక్టు మీకు అవగాహన అవుతూ ఉంటే ఆచరించాలనే బుద్ధి కలుగుతుంది. అవగాహనచేసుకోవటానికి కూడా నీకు నిర్మలమైన బుద్ధి, ఏకాగ్రమైనబుద్ధి, పవిత్రమైనబుద్ధి ఉండాలి. సకామకర్మలో ఉన్నవాడికి సంసారం వస్తుంది నిష్కామకర్మలో ఉన్నవాడికి మోక్షం వస్తుంది. పురాణాలు చదివి దేవుడు ఎక్కడ ఉన్నాడు అనుకొంటున్నాము. ఎక్కడో ఉన్నాడు అనుకొనేవాడు నీలోపలే ఉన్నాడు, నీకు అత్యంత సమీపంగా ఉన్నాడు. మనలను సుఖపెట్టేవస్తువు, మనకు శాంతిని కలుగజేసే వస్తువు మన హృదయంలోనే ఉంది. అయితే మనకు లోచూపులేదు. అందువలన అది మనకు తెలియటం లేదు. మనకు సూక్ష్మబుద్ధి ఉండాలి. సూక్ష్మబుద్ధి ఉంటేగాని విషయాన్ని అవగాహన చేసుకోలేము. మనం ఈశ్వరునిపట్ల భక్తి కలిగి ఉంటే, ప్రేమకలిగి ఉంటే, ఆయన పాదాలను ఆశ్రయించి ఉంటే ఆ బుద్ధిని మనకు ఈశ్వరుడు ప్రసాదిస్తాడు.

సత్పురుషుల సహవాసం వలన నీలో ఉన్న వాసనలు తగ్గుతాయి. వారి ప్రభావం వలన నీలో ఉన్న బలహీనతలు నీకు తెలియకుండా రాలిపోతాయి. నీలోపల ఉన్న

సత్యవస్తువుతో కలిసి ఉండలేకపోతున్నావు అందువలన బాహ్యాంగా ఉన్న సత్పురుషులతో సహవాసం చెయ్యటానికి ప్రయత్నించు. సజ్జన సాంగత్యం వలన నీవు డైరెక్టుగా ఫేస్ చెయ్యకుండానే అన్ని బంధాలు తెగిపోతాయి. సత్పురుషుల సహవాసం వలన వాసన వేరుతో సహానశిస్తుంది. ధ్యానం చేస్తూ ఉంటే చాలావిషయాలు జ్ఞాపకం వస్తున్నాయి అని భగవాన్‌తో చెప్పేవారు. నీ లోపల ఉన్నాయి కాబట్టి అవి బయటకు వస్తున్నాయి. నీలోపల ఉన్నవి నీకు తెలియాలికదా. వాటిని ఫేస్ చెయ్యి, భయపడవద్దు. వాటిని ఫేస్ చేసేకొలది వాటిని తొలగించుకొనే శక్తి నీకు పెరుగుతుంది. వాసన నశించాలంటే ఆ వాసనకు ఎదురీదాలి అంటే మంచిపనిని వాసనచేయవద్దు అంటుంది అప్పుడు ఆ మంచిపనిని మనం చేయాలి. అప్పుడు వాసనకు బలం తగ్గివాసన నశిస్తుంది. వాసన వచ్చినప్పుడు దానిని యాక్షన్‌లో పెడితే అది బలపడుతుంది. దానిని యాక్షన్‌లో పెట్టకుండా ఉంటే అది నశిస్తుంది.

భగవాన్ మీకు దేవుడిని చూపించరు, మిమ్మల్ని దేవుడిని చేస్తారు. దేహం పుడుతుంది. దేహానికి సంబంధించిన సుఖాలు అన్నీ పుట్టిన సుఖాలు. ఆత్మసుఖం పుట్టని సుఖం అందులో వెలితి ఉండదు, కొరత ఉండదు, అదిపూర్ణంగా ఉంటుంది, అది ఆభవ సుఖం. భౌతిక సుఖాలు ఎలా ఉంటాయి అంటే అయిదు నిమిషాలు అనుభవిస్తే ఆరో నిమిషంలో వెగటు పుడుతుంది. ఆత్మసుఖం అటువంటిది కాదు. ఏ క్షణానికి ఆక్షణం అది ఫ్రెష్‌గా ఉంటుంది. సహృదయం ఉన్నవాడి లక్షణం ఏమిటి అంటే వాడు ఏ స్థితిని పొందాడో ఆ స్థితిని మనచేత పొందింపజేయటానికి ప్రయత్నం చేస్తాడు. భగవంతుని నిరంతరం స్మరించటం వలన మనం పవిత్రులమవుతాము. పవిత్రులకు లోపల జీవితం తెలుస్తుంది. ఏకాగ్రత లేకుండా, పవిత్రత లేకుండా మనకు లోచూపురాదు. ఎన్నిశాస్త్రాలు అధ్యయనం చేసినా, ఎన్ని ప్రవచనాలు శ్రవణం చేసినా, ఎంత సత్కర్మచేసినా ఎన్నిచేసినా సత్పురుషుల సహవాసంతో సమానం కాదు. ఇవి అన్నీ సెకండరీ, నీవు చేసే సాధన అంతాకూడా సెకండరీ. గురువు అనుగ్రహం లేకుండా మన స్వభావం మార్చుకోలేము, మారు మనస్సు పొందలేము. కేవలం అధ్యయనం వలన దీనిని పొందలేము. నీకు సజ్జన సాంగత్యం దొరికినప్పుడు మిగిలిన నియమాలతో పనిలేకుండా పొందవలసిన వస్తువును పొందుతాము.

అరుణాచల శివ– అరుణాచల శివ– అరుణాచల శివ– అరుణాచలా

05-09-2000

అకారణముగా ఆయనను మరణభయము చుట్టిముట్టినది. అప్పుడు ఆభయమును శ్రీరమణమహర్షి నిశ్చలమనుస్సుతో పరిశీలించెను. ఇప్పుడు ఈ దేహము చనిపోయినది. ఇది స్మశానమునకు తీసుకొని వెళ్ళబడును అని తలంచినారు. ఆ సమయములో ఆయన శరీరము నిజముగా చనిపోయినది. ఈ శరీరము చనిపోయినప్పటికి చైతన్యవాహినిగా నేను ఉన్నాను. అని అనుభవ పూర్వకముగా అప్పుడు ఆయన తెలుసుకొనిరి. ఆ తరువాత తిరిగి చైతన్యం శరీరంలో ప్రవేశించి శరీరము కదలుట ప్రారంభించినది. అప్పటి నుండి భగవాన్ చైతన్యముతో తాదాప్యము పొంది సహజసమాధిస్థితిలో స్థిరపడినారు. శివుని ఆజ్ఞమేరకు ఆయన 1896 వ సం. సెప్టెంబర్ 1వ తేదీన తిరువణ్ణామలై వచ్చి అచ్చుట ఏబది నాలుగు సం॥లు ఆత్మబోధను చేసినారు. భగవాన్‌తో అన్నిరకముల జంతువులు కుక్కలు, నెమళ్ళు, కోతులు, పాములు, ఉడతలు, గోవులు స్నేహముగా ఉండేవి. భగవాన్ సన్నిధిలో గోవులక్ష్మి, తల్లి అలగమ్మ మోక్షము పొందినారు

## భగవాన్ తిరువణ్ణామలైలో నివశించిన ప్రదేశములు

| | |
|---|---|
| 1896 వ సం॥ | పెద్దగుడి ( అరుణాచలేశ్వరుని ఆలయము ), పాతాళ లింగం, గోపురాలు |
| 1897 వ సం॥ | గురుమూర్తం, మామిడితోట |
| 1898 నుండి 1899 సం॥ | పవలకున్రు, కొండగుహలు, పచ్చెయ్యమ్మన్ కోయల్ |
| 1900 నుండి 1916 సం॥ | విరూపాక్ష గుహ |
| 1916 నుండి 1922 సం॥ | స్కందాశ్రమం |
| 1922 సం॥ నుండి | శ్రీరమణాశ్రమం |

1950 వ సం॥ ఏప్రియల్ 14వ తేదీ రాత్రి గం॥ 8-47 ని॥లకు భగవాన్ దేహము విడిచి జ్యోతి స్వరూపము ఉల్కగా పైకి కనబడి అరుణాచలం కొండలో ఐక్యమయినారు.

ఆత్మజ్ఞానము అనుభవంలో ఉన్నవారిని సద్గురువులు అందురు. ఆ కోవలోని వారే సద్గురు శ్రీ జిన్నూరు నాన్నగారు. భగవాన్ శ్రీ రమణమహర్షి యొక్క ఆత్మబోధను సరళమైన భాషలో సద్గురు శ్రీ నాన్నగారు గత 40 సం॥ల నుండి ఎండకు వానకు వెరయక కుగ్రామములు కూడా వెళ్ళి అతి సామాన్యులకు కూడా అందుబాటులో ఉండి వారి భౌతిక అవసరములు కూడా తీర్చి అనుగ్రహభాషణములు అందిస్తున్నారు. ఈ అనుగ్రహభాషణములు చదివి మననం చేసి తరించండి.

**శ్రీ రమణ క్షేత్రం**

జిన్నూరు

# ఉత్తమ ఉపాధ్యాయులకు అభినందనలు

జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో గురుపూజోత్సవం సందర్భంగా ప్రభుత్వ, ప్రయివేటు అవార్డులు పొందుతున్న ఉత్తమ ఉపాధ్యాయులకు రమణ భాస్కర అభినందనలు.

పాలకొల్లు మండలం ఆగర్రు ఉపాధ్యాయులు శ్రీ ఎన్.ఎస్.వి. రామకృష్ణంరాజు, జిన్నూరు హైస్కూలు నుండి శ్రీ వై.ఎల్.వి. శాస్త్రి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వారికి ఈ ప్రాంతములోని పలువురు అభినందనలు తెలిపారు.

డా సర్వేపల్లి రాధాకృష్ణన్ భారతదేశంలో ప్రపంచం గర్వించదగ్గ తత్వవేత్తగా నిలచి మన దేశానికి గౌరవం తెచ్చి పెట్టారు. మహోన్నతమైన ఉపాధ్యాయ వృత్తినుండి ఉపరాష్ట్రపతి పదవికి ఎదిగి, రాష్ట్రపతిగా దేశానికి రక్షగానిలచిన ఆయన జన్మదినం సెప్టెంబర్ 5న గురుపూజోత్సవంగా జరుపుకోవటం మనందరి అదృష్టం. ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమాలే కాకుండా వివిధ సేవా సంస్థలుకూడా గురువులను సత్కరించి మంచి సంస్కృతిని కొనసాగిస్తున్నారు.

డాక్టర్ త్సవటపల్లి సత్యనారాణ మూర్తి పాలకొల్లులో అగ్రశ్రేణి వైద్యులు సేవా కార్యక్రమాలతో పాటు గురువులను గౌరవించాలని నిర్ణయించుకొని 4 సంవత్సరాలుగా పాలకొల్లులో ఉత్తమ ఉపాధ్యాయుని ఎంపికచేసి 5 వేల రూపాయల నగదు పారితోషికంతో గౌరవించటం ఆయన విధేయతకు నిదర్శనం. తనకు పాఠాలు చెప్పి తీర్చిదిద్దిన గురువులకు గుర్తుగా ఈ అవార్డును ప్రవేశపెట్టానని చిరు సత్కారానికి అంగీకరించే ఉపాధ్యాయులు ఎప్పడూ గురుతుల్యులేనని ఆయన చెప్పారు. కంభంపాటి కామేశ్వరరావు ఈ సంవత్సరం డాక్టర్ బాబ్జి గారిచే సరేపల్లి అవార్డు వరించిది. మరో ముగ్గురు ప్రసంసా అవార్డులు పొందారు. డాక్టర్ బాబ్జి ఉత్తమ ఉపాధ్యాయుని ఎంపికచేసే తీరు పలువురిని ఆకట్టుకొంది. రైస్‌మిల్లర్స్ కాన్వెంట్‌లో డిప్యుటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ శ్రీజచ్చాల్ అవార్డులు అందించారు. కడిమిళ్ళ వరప్రసాద్ విశ్వ అవధాని ముఖ్య వక్తగా పాల్గొన్నారు.